క్లుప్తంగా

సర్దార్‌పటేల్ యువజన సంఘం కమిటీ ఎన్నిక

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సర్దార్‌పటేల్ యువజన సంఘం నూతన కమిటీని శనివారం ఆ సంఘం భవనంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పులియోజు వెంకటాచారి, ఉపాధ్యక్షుడిగా లింగం తిరుమలేష్, ప్రధాన కార్యదర్శిగా పాల్వాయి నవీన్, సంయుక్త కార్యదర్శిగా ఉప్పునూతల వెంకటేశ్, కోశాధికారిగా లింగం వికాస్, సంస్కృతిక కార్యదర్శిగా పాల్వాయి సత్యనారాయణ, ఉత్సవ కార్యదర్శిగా తూళ్ల ఉదయ్ కర్ణ, కార్యనిర్వహణ కార్యదర్శిగా కందిరీగల విజయ్, క్రీడా కార్యదర్శి కాసులు శివకుమార్, వ్యాయామశాల కార్యదర్శిగా గున్నాల మల్లేశ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా గున్నాల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా కర్రె శ్రీకాంత్, ఎరుకల హరిప్రసాద్, అనెమౌని అకిల్, లింగం వేణు, ఉప్పునూతల దినేశ్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువజన సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

ప్రజాపాలనలో గ్రామాల అభివృద్ధి



ఎల్‌ఈడీ లైట్లు అమర్చుతున్న కాంట్రాక్ట్ సిబ్బంది

కందుకూరు: కాంగ్రెస్ ప్రజా పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని కాంగ్రెస్ నాయకులు బొక్క సంజీవరెడ్డి, సొడవు శేఖర్‌గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధి కొత్తగూడ గేట్ నుంచి కొత్తగూడ గ్రామం వరకు ఎల్‌ఈడీ ఐమాస్ట్ లైట్లను అమర్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ చొరవతో గ్రామానికి రూ.9 లక్షల నిధులతో 77 ఎల్‌ఈడీ ఐమాస్ట్ లైట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎండీ ఖదీర్, హనుమంత్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, కృష్ణయ్య, శంకర్‌గౌడ్, అంజయ్య, దామోదర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేక పోతున్న సబితారెడ్డి

ఏఐసీసీ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కాంగ్రెస్ పాలనపై ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక సబితారెడ్డి కాలనీలకు వచ్చి పార్టీలపరంగా చిచ్చుపెడుతోందని బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం రాఘవేందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. గుర్రంగూడకు వచ్చిన ఎమ్మెల్యే సబితారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని ఆయన ఖండించారు. గుర్రంగూడకు బంజారా పండగకు వచ్చిన ఎమ్మెల్యే బంజరా భవనం స్థలం కేటాయిస్తానని మాట ఇచ్చారు.. ఏమైందని ప్రశ్నించారు. నాడు మంత్రి పదవి కాపాడుకోవడానికే ఇలాంటి చిల్లర హామీలు ఇచ్చారని ఆరోపించారు. గతంలో మంత్రి హోదాలో ఉండి కల్లబొల్లి మాటలతోనే సరిపెట్టారని విమర్శించారు. నేడు రేవంత్‌రెడ్డి పాలనలో పేదలకు, అర్హులకు ఆరుగ్యారంటీల పథకాలు ఒక్కొక్కటిగా అమలు అవుతున్నాయన్నారు. కాంగ్రెస్ పాలనలో పేదలకు న్యాయం జరుగుతుంటే బీఆర్‌ఎస్ నాయకులు తట్టుకోలేకపోతున్నారన్నారు. స్థానికంగా గ్రీన్‌జోన్ ఎత్తివేస్తానని కాలనీలను నమ్మించి మోసం చేశారని విమర్శించారు.

కొర్వి కృష్ణస్వామికి నివాళి



నివాళులర్పిస్తున్న ముదిరాజ్ మహాసభ నాయకులు

కందుకూరు: ముదిరాజ్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, హైదరాబాద్ తొలి మేయర్ కొర్వి కృష్ణస్వామి 132వ జయంతిని పురస్కరించుకొని ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హైదరాబాద్‌కు ఎనలేని సేవలు అందించిన ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు పిట్టల పాండుముదిరాజ్, గౌరవ అధ్యక్షుడు కాకి రాములుముదిరాజ్, జనరల్ సెక్రటరీ కొర్వి సురేందర్‌ముదిరాజ్, మత్స్యశాఖ అధ్యక్షుడు పి.లింగంముదిరాజ్, నాయకులు పాల్గొన్నారు.

వర్షాకాలం.. అప్రమత్తం

- రోగాలతో పశు సంపద జాగ్రత్త
- వ్యాధి లక్షణాలు గుర్తిస్తే మేలు
- సకాలంలో టీకా తప్పనిసరి
- పశువైద్యాధికారి డా.విశ్వేశ్వర్



మహేశ్వరం: వర్షాకాలంలో పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని, సకాలంలో గుర్తిస్తే మేలని పేర్కొంటున్నారు. అనంతరం టీకా వేయించి, రోగాల బారి నుంచి వాటిని కాపాడుకోవాలని దుబ్బచర్ల పశువైద్యాధికారి డాక్టర్ విశ్వేశ్వర్ పేర్కొన్నారు. ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ క్రింది విధంగా వివరించారు.

గొంతువాపు

వర్షకాలంలో పశువులకు ప్రధానంగా వచ్చేది గొంతువాపు వ్యాధి. దీనినే గురకవ్యాధి అంటారు. ఇది సూక్ష్మ జీవుల వలన సంక్రమిస్తుంది. అంటు వ్యాధిగా ఇతర పశువులకు సోకుతుంది. కలుషిత నీరు, మేత ద్వారా రోగ నిరోధక శక్తి తగ్గి, వ్యాధి బారిన పడతాయి. కంటి నుంచి నీరు, నోటి నుంచి నురగ కారుతూ, గురక శ్వాస పీల్చడం కష్టమవుతుంది. గుర్రుమని శబ్దం వస్తుంది. జ్వర తీవ్రత 104 నుంచి 106 డిగ్రీల వరకు ఉంటుంది. గొంతు కిందకు నీరుదిగి వాపు వస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువు 24 గంటల్లో చనిపోతుంది.

నివారణ

వర్షాకాలం ముందు జూన్, జూలైలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. వ్యాధి ఉన్న పశువుల దొడ్డి, గదులను క్రిమిసంహారక మందులతో శుభ్రం చేయాలి. వ్యాధి లక్షణాలు కనిపించిన పశువును వెంటనే గుంపు నుంచి వేరు చేయాలి. వ్యాధి తీవ్రతను బట్టి సల్ఫాడిమిన్, ఇంటాసెఫ్ టాజు, ఎక్సెప్టై వంటి సూది మందు వేయాలి. పశు వైద్యాధికారిని సంప్రదించాలి.

గాలికుంటు

ఈ వైరస్ నేలలు చిత్తడిగా ఉండటం లేదా కలిషితమైన గాలి ద్వారా వ్యాపిస్తుంది. తల్లిపాల ద్వారా దూడలకు వచ్చే అవకాశం ఉంటుంది. ఏటా వర్షాకాలంలో గేదె, ఎద్దు, ఆవులకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటి. గిట్టలు ఉన్న ప్రతి జీవికి సోకుతుంది. ఈ సమయంలో పశువుకు 104 నుంచి 105 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత ఉంటుంది. నోటిలో గిట్టల మధ్య పుండ్లు పుట్టి, పాడి పశువులు నడవలేని స్థితికి చేరతాయి. వర్షాలు ఎక్కువగా ఉండి చలిపెడుతున్నప్పుడు వ్యాధి విజృంభిస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువులకు నోటి, గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడతాయి. 3,4 వారాల్లో అవి పగిలి పుండ్లుగా మారతాయి. నోటి చిగుళ్లపై పొక్కులు ఏర్పడడంతో మేత తీసుకోలేక నీరసించి పోతాయి. ప్రధానంగా వర్షాకాలంలో నేలలు చిత్తడిగా ఉండటం వలన ఈ రోగం వస్తుంది. ఈ వ్యాధి వలన చూడి గేదెలు ఈసుకుపోతాయి. పాడి పశువులకు పాల దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా టీకా వేస్తుంది. టీకా వలన పశువులు రోగ నిరోధక శక్తిని పెంచుతుంది.



చికిత్స..

వ్యాధి సోకిన పశువును మంద నుంచి వేరు చేయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్ గ్లిజరిన్ కలిపి పూయాలి. గిట్టల మధ్య పుండ్లకు పరమాంగనెట్ ద్రావణంతో శుభ్రం చేసి, వేప నూనె రాయాలి. యాంటిబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ వాడితే ఉపశమనం కలుగుతుంది. బిస్ప్రెపెన్ 2.5గా, ఎన్‌రోప్లాక్సిన్ 50 ఎంఎల్, సెఫ్ట్రిక్స్ 3 గ్రాములు, మెలోనెక్స్ 30 ఎంఎల్, నిమోవెట్ 50 ఎంఎల్ వాడితే పశువులు పూర్తిగా ఆరోగ్యంగా ఉంటాయి.

జబ్బువాపు

ఈ వ్యాధి క్లాస్ట్రిడియం చావై బాక్టీరియా ద్వారా పశువులకు సోకుతుంది. ఆరు నెలల నుంచి రెండేళ్ల లోపు వయసున్న వాటికి ఎక్కువగా వ్యాపిస్తుంది. ఈ వయసులో వీటికి రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. భుజం, తొడ ప్రాంతాల్లోని కండరాలను ఆశించి, ఆ కండలు కుళ్లిపోయేలా చేస్తుంది. దీని వలన అవి కుంటుతాయి. వెనుక లేదా ముందు కాలును పైకి లేపి ఉంచి కుంటడం చేస్తాయి. చికిత్స.. వ్యాధి ప్రారంభంలోనే పెన్సిలిన్ వంటి యాంటి బయాటిక్స్ వాడాలి. వ్యాధిగ్రస్త పశువుల్ని వేరుచేయాలి. ఈ రోగంతో చనిపోయిన పశువులను గుంతతీసి పూడ్చిపెట్టాలి. వ్యాధి రాకుండా వర్షాకాలం ముందే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.

కేంద్రం నిధులతోనే అభివృద్ధి



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకుడు కృష్ణగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధి జైత్వారంలో సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటి ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల నుంచి పేదలకు ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తోందన్నారు. వృద్ధులు, వితంతువులకు పింఛన్లు ఇస్తుందని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని ప్రజలను కోరారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగిరేలా చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో ముచ్చర్ల ఎంపీటీసీ మాజీ సభ్యుడు మల్లేశ్, బీజేపీ మండల కార్యదర్శి రఘునందన్, చంద్రారెడ్డి, కుమ్మరి నరసింహ, నవీన్, మధు, నరేంద్ర ముదిరాజ్, ఆంజనేయులు, పాండు, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు ప్రత్యేక రెజిమెంట్లు కల్పించాలి

నాగోలు: భారత- చైనా యుద్ధం (1962) లో వీరమరణం పొందిన 114 మంది యాదవ శౌర్య యోధుల వీరత్వాన్ని స్మరించుకుంటూ అఖిల భారత యాదవులు నిర్వహించే యాత్రనే రెజింగ్లరాజ్ కలశ యాత్ర అంటారని అఖిల భారత యాదవ మహాసభల తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చింతల రవీంద్రనాథ్ అన్నారు. శనివారం యాత్రను శుభం కన్వెన్షన్ నుంచి మన్సూరాబాద్ డివిజన్ మీదుగా అల్కాపురి లోని శ్రీకృష్ణ మందిర్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవులకు ప్రత్యేక రెజిమెంట్లు కల్పించాలన్నారు. ఈ కలశ యాత్ర నవంబర్ 18వ తేదీన ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ముగుస్తుందన్నారు. యాదవుల అహిర్ (యాదవ) రెజిమెంట్ పునఃస్థాపన కోసం యాత్రలు చేస్తున్నామన్నారు.



కలశ యాత్రలో యాదవ సంఘం నాయకులు

దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన యాదవ వీరుల త్యాగాలను స్మరిస్తూ చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లే మహోత్తర కృషిగా ఈ యాత్ర సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సురేందర్ యాదవ్, కిరణ్ కుమార్ యాదవ్, వివిధ సంఘాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

సింగిరెడ్డి ఆశయ సాధనకు కృషి

సైదాబాద్: జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్, దివంగత బీఆర్‌ఎస్ నాయకుడు సింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి సేవలు చిరస్మరణీయమని సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి అన్నారు. శనివారం సింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి 8వ వర్ధంతి పురస్కరించుకొని ఆమె పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న సింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సింగిరెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సునీల్‌రెడ్డి, సంగీత, శ్రీనివాసరెడ్డి, లక్ష్మణ్ ఠాకూర్, శ్రవణ్‌కుమార్, రవికిరణ్, పరమేష్, నందు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

బీఆర్‌ఎస్ నేతలు అనంతరెడ్డి, నర్సింహారెడ్డి

మొయినాబాద్: స్వాతంత్య్ర దినోత్సవం రోజు జాతీయ జెండాను అవమానపరిచే విధంగా వ్యవహరించిన మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్‌ను ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలని బీఆర్‌ఎస్ నేతలు కొంపల్లి అనంతరెడ్డి, కొత్త నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మొయినాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని అన్ని వార్డు కార్యాలయాల వద్ద జాతీయ జెండా ఎగురవేయాలని స్థానిక నాయకులు, ప్రజలు మున్సిపల్ కమిషనర్‌ను కోరినా ఆయన నియంతలా వ్యవహించారని ఆరోపించారు. ప్రజలకు సరైన సమాధానం చెప్పకుండా తన ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ అందరినీ కించపరిచేలా వ్యవహించాడని మండిపడ్డారు. మున్సిపల్ కార్యాలయానికి ఏదైనా పనికోసం ప్రజలు వెళ్లినా దురుసుగా మాట్లాడుతున్నారన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులపై దృష్టి పెట్టకుండా.. ఎక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయో అక్కడికి వెళ్లి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇంటి నంబర్లు ఇవ్వడానికి రూ.లక్షల్లో డబ్బులు తీసుకుంటున్నారని.. తన చుట్టూ కొంత మందిని కోటరిగా పెట్టుకొని వసూలు చేస్తున్నారన్నారు. నియంతలా వ్యవహరిస్తున్న మున్సిపల్ కమిషనర్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కోట్ల నరోత్తంరెడ్డి, శ్రీహరియాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోర శ్రీనివాస్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రూ. 5 లక్షల విరాళం అందజేత

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ఆర్‌కేపురం చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు రూ.5 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనాథ విద్యార్థి గృహం ఒక అద్భుత గృహమని ఇక్కడి విద్యార్థులకు బంగారు భవిష్యత్‌ను అందిస్తున్న గృహ కమిటీని అభినందించారు. అనాథ విద్యార్థుల చదువుల నిమిత్తం ఆర్థిక సహాయం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గృహ అధ్యక్షులు మార్గం రాజేష్, శశిమోహన్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, గుత్తా హరివంశరెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని బండ్లగూడలోని శ్రీనివాసనగర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి వారి దేవాలయ సన్నిధిలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం నాలుగో శనివారం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మోటుపల్లి లక్ష్మీ రామాచార్యుల ఆధ్వర్యంలో స్వామికి సహస్ర అష్టోత్తర అరటిపండ్ల పూజ నిర్వహించారు.

టాయిలెట్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో బీటీటీ పద్ధతిలో నిర్మిస్తున్న టాయిలెట్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎస్‌జీఎస్ చిలుక నర్సింహారెడ్డి సూచించారు. శనివారం ఆయన పనులను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. రూ. 15 లక్షలతో టాయిలెట్ పనులు జరుగుతున్నాయని త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. సూపర్‌వైజర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

హస్తినాపురం: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధి నందనవనం కాలనీలో పయనీర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. వైద్యం చేయించుకోలేని నిరుపేద ప్రజలకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. శిబిరంలో పాల్గొన్న వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న నాయకులు



తుక్కుగూడ: శ్రీ కృష్ణుడి వేషధారణలో చిన్నారి

మీర్‌పేట: శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా శనివారం కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని శ్రీ మత్స్యావతార వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో మహేశ్వరం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీకృష్ణుడి జీవితం ధర్మానికి, నైతికతకు, ప్రజాస్వామ్యానికి నిలువెత్తు ఉదాహరణ అని, యువత ఆయన బోధనలను ఆదర్శంగా తీసుకొని సమాజాన్ని మంచి మార్గంలో నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఆలయ అర్చకులు శ్రీరాములును సత్కరించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మీర్‌పేట-1, 2 అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేష్ ముదిరాజ్, నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

హస్తినాపురం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచించారు. హస్తినాపురం డివిజన్ పరిధి సాయిప్రకాశ్‌నగర్‌కాలనీలో డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మొక్కలు నాటారు. అ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు మొక్కలు పెంచటం ఒక్కటే మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మానాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉండటం గొప్పవరం

హయత్‌నగర్: ప్రస్తుతం ఆహార అలవాట్ల కారణంగా ప్రతి ఒక్కరు అనారోగ్యాల బారిన పడుతున్నారని, ఆరోగ్యంగా ఉండటంతో గొప్ప వరమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం హయత్‌నగర్ డివిజన్‌లోని రాఘవేంద్రనగర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డితో కలిసి ఇండోర్ ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు జిమ్‌కు వెళ్లడం అలవాటుగా చేసుకోవాలన్నారు. నియోజకవర్గ ప్రజలకోసం పలు చోట్ల జిమ్‌లను ఏర్పాటు చేశామని ఇండోర్ ఓపెన్ జిమ్ ఇదే మొదటిదన్నారు. ఈ కార్యక్రమంలో సామ తిరుమల్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, సింగిరెడ్డి మల్లీశ్వరిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మల్లేష్, రవిందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కాలనీల్లో మురుగు పరుగు



శ్రీరమణ కాలనీ రహదారిపై పారుతున్న మురుగు

ఎల్‌బీనగర్: హస్తినాపురం డివిజన్ పరిధి శ్రీరమణ, రెడ్డికాలనీ వంటి పలు లోతట్టు ప్రాంతాల్లో సంవత్సరాల తరబడి పూడికతీత, విస్తరణకు నోచుకోని ఓపెన్ నాలాలు, తెరుచుకున్న మ్యాన్‌హోళ్లతో కాలనీలు దుర్గంధంగా మారుతున్నాయి. గత వారం రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు మ్యాన్ హోళ్ల నుంచి ఉబికి వస్తున్న మురుగుతో దోమలు, ఈగలు వృద్ధి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

వాజ్‌పేయి జీవితం ఆదర్శనీయం



కొత్తపేటలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సామరంగారెడ్డి, పవన్‌కుమార్


నాగోలు: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జీవితం అందరికీ ఆదర్శమని బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు సామా రంగారెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. శనివారం అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటాలు ఏర్పాటు చేసి నివాళులర్పించారు.

చంద్రపురికాలనీలో..


మన్సూరాబాద్: అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఎల్‌బీనగర్ చంద్రపురికాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో సామ రంగారెడ్డి పాల్గొని వాజ్‌పేయి చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాంపల్లి రామేశ్వర్, కృష్ణంరాజు, విద్యాసాగర్, గంగదాసు కృష్ణారెడ్డి, ఎలేపురేందర్‌నేత పాల్గొన్నారు.

కృష్ణతులసినగర్ కమ్యూనిటీహాల్లో..

మలక్‌పేట: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విప్లవాత్మక నిర్ణయాలతో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించారని మూసారంబాగ్ బీజేపీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. కృష్ణతులసినగర్ కమ్యూనిటీహాల్లో శనివారం నిర్వహించిన వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దేవేందర్, సురేందర్, జక్కా మోహన్‌రెడ్డి, వరప్రసాద్, రంజిత్, ప్రవీణ్, రాంచందర్, లక్ష్మణ్, దినేష్, పరశురామ్ పాల్గొన్నారు.



చంద్రపురికాలనీలో..



ఎల్‌బీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో..

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కాలనీలలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని 6, 9 వార్డుల్లో ఆయన పర్యటించారు. కాలనీవాసులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సమస్యలను పరిష్కరించాలని ఆయా కాలనీవాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో గల కిషన్‌నగర్ రోడ్డు, బీరప్పకాలనీ, జీహెచ్ఆర్ కాలనీల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను 15 రోజుల్లోనే పరిష్కరించామని స్పష్టం చేశారు. కాలనీవాసులు చెప్పిన వెంటనే విద్యుత్ అధికారులతో సమీక్షించి విద్యుత్ నియంత్రికలు, స్తంభాలను ఏర్పాటు చేయించామన్నారు. కాలనీవాసులందరూ చర్చించుకొని సమస్యలను మా దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ నియంత్రికలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు.

దసరాలోపు పూర్తి చేస్తాం

మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో పర్యటించిన ఎమ్మెల్యేకు సాయిబాబకాలనీ, టీచర్స్‌కాలనీల్లో నెలకొన్న సమస్యలపై కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే దసరాలోపు అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ప్రధానంగా అంతర్గత మురుగు కాల్వలు, సీసీ రోడ్లు, వీధిదీపాల ఏర్పాటు వంటి సమస్యలను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు.